
సాక్షి
నిజామాబాద్
మంగళవారం । 3 । అక్టోబర్ । 2023



మోదీజీ.. మొర ఆలకించండి
జిల్లాలో ఆయుర్వేద ఆస్పత్రి ఏర్పాటు చేయాలన్న తమ మొరను మోదీ ఆలకించాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.
- 8లో ▸



ముగిసిన బాల్‌బ్యాడ్మింటన్ టోర్నీ
ఆర్మూర్‌లో నిర్వహించిన 42వ బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో నిజామాబాద్ జట్టు విజేతగా నిలిచింది.
- 9లో ▸

గరిష్టం/కనిష్టం
31.9 /24.3
వాతావరణం
ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. వాతావరణంలో తేమ అధికంగా ఉంటుంది. ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి మంచు కురియవచ్చు.

బీజేపీ జోష్..

- జిల్లా కేంద్రంలో నేడు ప్రధాని మోదీ సభ
- భారీగా తరలిరానున్న పసుపు రైతులు
- పసుపు బోర్డు ప్రకటనతో సంబురాల్లో పార్టీ శ్రేణులు
- గ్రామీణ ప్రాంతాల్లోనూ అనేక రెట్లు బలం పెరుగుతుందని ధీమా
- ఎంపీ అర్వింద్ అనుకున్నది సాధించారంటూ నేతల అభినందనలు

ప్రధాని నరేంద్ర మోదీ పసుపు బోర్డు ప్రకటించడంతోనే ఉత్తర తెలంగాణలో రాజకీయం ఒక్కసారిగా మారిపోయింది. మంగళవారం ప్రధాని జిల్లా కేంద్రానికి రానుండగా జిల్లాతో పాటు నిర్మల్, జగిత్యాల జిల్లాల నుంచి పసుపు రైతులు పెద్ద ఎత్తున తరలివస్తున్నారు. జనగర్జన పేరిట జరిగే సభను ప్రధానమంత్రికి కృతజ్ఞత సభగా మార్చనున్నట్లు చెబుతున్నారు. మరోవైపు బీజేపీ శ్రేణుల్లో ఉత్సాహం అనేక రెట్లు పెరిగింది.

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : 'పసుపు బోర్డు'.. ఈ ఒక్క అంశంతోనే ధర్మపురి అర్వింద్ గత పార్లమెంట్ ఎన్నికల్లో కల్వకుంట్ల కవితకు ఓటమి రుచి చూపించి ఎంపీగా విజయం సాధించారు. ఎంపీ అయ్యాక అర్వింద్ కేంద్రం నుంచి అనేక నిధులు తీసుకొచ్చినప్పటికీ పసుపుబోర్డు అంశం మాత్రం ఎప్పటికప్పుడు రాజకీయ పార్టీల మధ్య సవాళ్లు, ప్రతిసవాళ్లకు కేంద్రబిందువైంది. ఎంపీ అర్వింద్ పార్లమెంట్ నియోజకవర్గంలో పర్యటనకు వచ్చిన ప్రతిసారి పసుపుబోర్డు హామీనే లక్ష్యంగా చేసుకుని బీఆర్ఎస్ శ్రేణులు దాడులకు సైతం దిగిన ఘటనలు పలుమార్లు చోటుచేసుకున్నాయి. పసుపుబోర్డు తీసుకొస్తానని బాండ్ పేపర్ రాసిచ్చిన అర్వింద్ మాట తప్పారంటూ బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు విమర్శల వర్షం కురిపిస్తూ వచ్చారు. ఈ విమర్శలను దీటుగా తిప్పికొడుతూ అర్వింద్ ఎప్పటికప్పుడు బీఆర్ఎస్ వైఫల్యాలపై ఎదురుదాడికి దిగుతూ వచ్చారు. ఈ మాటల యుద్ధం నేపథ్యంలో అనేకసార్లు ఎంపీ పర్యటనల సమయంలో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీ శ్రేణుల మధ్య నువ్వా.. నేనా అనేవిధంగా ఘర్షణ వాతావరణం సైతం చోటుచేసుకుంది. ఈ ఘర్షణల్లో కార్యకర్తలతో పాటు పోలీసులు గాయాలపాలైన ఘటనలు ఉన్నాయి. ఇలాంటి నేపథ్యంలో శాసనసభ ఎన్నికలకు కౌంట్‌డౌన్ ప్రారంభమైన సమయంలో.. నేరుగా భారత ప్రధాని నరేంద్రమోదీ ఇందూరులో పసుపుబోర్డు ఏర్పాటుకు ప్రకటన చేయడంతో ఉత్తర తెలంగాణలో రాజకీయ వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. బీజేపీ శ్రేణుల్లో ఉత్సాహం అనేక రెట్లు పెరిగింది. ఎంపీ అర్వింద్ ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారంటూ నాయకులు, కార్యకర్తలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



బీజేపీ కార్యాలయం ముందు పార్టీ నాయకులు, కార్యకర్తల నృత్యాలు



ఎంపీ అర్వింద్, పల్లె గంగారెడ్డి, ధన్‌పాల్ తదితరులు

కృతజ్ఞత సభగా..

అధికారిక కార్యక్రమాలతో పాటు రాజకీయంగా బహిరంగ సభలో ప్రధానమంత్రి పాల్గొననుండడంతో పార్టీ ఇందూరు జనగర్జన పేరిట సభకు నామకరణ చేసింది. అయితే ఈ సభకు రెండురోజుల ముందే ప్రధాని పసుపు బోర్డు ఏర్పాటు ప్రకటన చేయడంతో పసుపు రైతులు ఈ సభకు మూడు జిల్లాల నుంచి భారీగా తరలి రానున్నారు. సభను ప్రధానమంత్రికి కృతజ్ఞత సభగా మార్చనున్న ట్లు పసుపు రైతులు చెబుతున్నారు. ఈ నెల1న పాలమూరు పర్యటనలో ప్రధాని నేరుగా పసుపు బోర్డు ప్రకటన చేయడంతో అప్పటి నుంచి నిజామాబాద్, నిర్మల్, జగిత్యాల జిల్లాల్లో బీజేపీ కార్యకర్తలు, రైతులు సంబురాలు చేసుకుంటున్నారు. మూడు జిల్లాల నుంచి రైతులు తరలి వచ్చి ఎంపీ అర్వింద్‌కు పెద్ద ఎత్తున సన్మానాలు చేస్తున్నారు. ప్రధానమంత్రి సభ నేపథ్యంలో సభా ప్రాంగణం వద్దకు ఒకరోజు ముందునుంచే మహిళలు వచ్చి వెళుతున్నారు.

జై నరేంద్ర మోదీ అంటూ సభా ప్రాంగణం వద్ద చాలామంది మహిళలు నృత్యాలు చేస్తున్నారు. ప్రధాని రాక కోసం ఎదురు చూస్తున్నట్లు మహిళలు చెబుతుండడం విశేషం. సభాప్రాంగణం వద్ద నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ బీజేపీ ఫ్లోర్ లీడర్ స్రవంతి రెడ్డి వద్దకు వచ్చిన మహిళలు పాసుల కోసం అభ్యర్థనలు చేస్తున్నారు.

గాంధేయమార్గం అందరికీ ఆదర్శం

- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

సుభాష్‌నగర్: గాంధేయ మార్గం అందరికీ ఆదర్శం, అనుసరణీయమని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, నగర మేయర్ దండు నీతూకిరణ్ అన్నారు. జాతిపిత మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని నగరంలోని గాంధీచౌక్‌లో ఉన్న ఆయన విగ్రహానికి సోమవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. అదేవిధంగా మాజీ ప్రధాని లాల్ బహదూర్‌శాస్త్రి జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఇరువురూ దేశానికి అందించిన సేవలను కొనియాడారు. జాతిపిత చూపిన బాటలో పయనిస్తూ దేశాభ్యున్నతికి, సమాజ హితానికి ప్రతి ఒక్కరూ పాటుపడాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. నగర మే యర్ దండు నీతూకిరణ్, అదనపు కలెక్టర్లు చిత్రామిశ్రా, యాదిరెడ్డి, నగర పాలక సంస్థ కమిషనర్ మకరంద్, అధికారులు, ఆయా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



గాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న కలెక్టర్

శ్రమ ఫలించింది..

- పసుపు బోర్డు ప్రకటనతో ఆనందంగా ఉంది
- ప్రధాని, కేంద్రమంత్రి, రైతుల అభినందనలు ఆకట్టుకున్నాయి..
- నేటి మోదీ సభను జయప్రదం చేయండి
- ఎంపీ ధర్మపురి అర్వింద్

సుభాష్‌నగర్ : 'పసుపు బోర్డు ఏర్పాటు ప్రకటనలో సైంటిఫిక్, ఎకనామికల్, ట్రెడిషన్, కల్చర్ ఎమోషనల్ పని చేశాయి. సందర్భానుసారంగా ప్రధాని మోదీ, కేంద్రమంత్రి అమిత్ షాకు రాసిన లేఖలు, నేను పడ్డ శ్రమకు ఫలితం వచ్చింది' అని ఎంపీ అర్వింద్ ధర్మపురి పేర్కొన్నారు. సోమవారం నగరంలోని బీజేపీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. పలువురు తనకు రాజకీయాలకు అతీతంగా అభినందనలు తెలియజేస్తున్నారన్నారు. పసుపు నాటిన దగ్గర నుంచి మార్కెటింగ్ వరకూ పసుపు బోర్డు ఉపయోగపడుతుందని, కోల్డ్ స్టోరేజీలు, గోదాములు, వేర్‌హౌజ్‌లు నిర్మించుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. రైతుల కోసం అవసరాన్ని బట్టి స్పైసెస్ రీజినల్ కార్యాలయాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఇందుకు రూ.30 కోట్లు ఖర్చు చేశామని, బంగ్లాదేశ్‌కు రైలు ద్వారా పసుపు ఎగుమతి చేశామన్నారు. తాను ఎంపీగా ఉన్న సమయంలో ప్రధాని మోదీ పసుపు బోర్డు ప్రకటన చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. పసుపు రైతుల కల నెరవేరిందని, ప్రతీ రైతుకు ఎంపీ శుభాకాంక్షలు తెలియజేశారు.

ఇందూరు నుంచే మార్పు..

నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలోని ఏడు అసెంబ్లీ స్థానాల్లో కాషాయ జెండా ఎగురవేసి రాజకీయాల్లో మార్పునకు ఇందూరు నుంచే శ్రీకారం చుడతామని ఎంపీ అర్వింద్ పేర్కొన్నారు. కల్వకుంట్ల కుటుంబం దొరతనం, అహంకారం దించే వరకూ ఇలాగే మాట్లాడతానన్నారు. ప్రజలను నిత్యం మోసం చేస్తున్న కేసీఆర్, కేటీఆర్.. ప్రధాని మోదీని మోసగాడు అంటారా? అని మండిపడ్డారు. బిడ్డా కేటీఆర్ జాగ్రత్త.. ధాన్యం బ్లాక్‌మార్కెట్ చేస్తూ అవినీతికి పాల్పడుతున్న నీవు కవిత కంటే ముందే జైలు వెళ్తావని హెచ్చరించారు. నరేంద్ర మోదీ వచ్చినప్పుడు సీఎం కేసీఆర్ మర్యాదపూర్వకంగా స్వాగతం పలకాలని, ఆ నీతి నేర్చుకోవాలని హితవుపలికారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ ధర్మపురి అర్వింద్

సభను జయప్రదం చేయండి..

పసుపు రైతుల దశాబ్దాల కల నెరవేర్చిన ప్రధాని నరేంద్ర మోదీ రానున్న 'ఇందూరు జనగర్జన' సభకు మంగళవారం రైతులు, ప్రజలు, యువత, మహిళలు పెద్దసంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని అర్వింద్ కోరారు. సమావేశంలో పార్టీ నేత ధన్‌పాల్ సూర్యనారాయణ పసుపు కొమ్ముల దండతో అర్వింద్‌ను సన్మానించారు. అనంతరం పార్టీ కార్యాలయం బయట ఎంపీ సహా నాయకులు పసుపు చల్లుకుంటూ నృత్యాలు చేశారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి పల్లె గంగారెడ్డి, జిల్లాల అధ్యక్షులు బస్వా లక్ష్మీనర్సయ్య, సత్యనారాయణ, తుల ఉమ, రాష్ట్ర కార్యవర్గసభ్యులు పెద్దోళ్ల గంగారెడ్డి, బోగ శ్రావణి, పైడి రాకేశ్ రెడ్డి, దినేశ్ కులాచారి, మోహన్‌రెడ్డి, ప్రకాశ్‌రెడ్డి, నూతుల శ్రీనివాస్‌రెడ్డి, న్యాలం రాజు, స్వామి యాదవ్ పాల్గొన్నారు.

- 'మన పసుపు రైతులకు ఉజ్వల భవిష్యత్ అందించేందుకు ఎంతవరకైనా వెళ్తాం.. ఏమైనా చేస్తాం' అని ప్రధాని మోదీ నా ట్వీట్‌కు రీ ట్వీట్ చేశారు.
- పసుపు బోర్డు, మాధవనగర్ ఆర్‌ఓబీ పూర్తయితే నిజామాబాద్‌కు ఎప్పటికీ నీవే ఎంపీవని నల్గొండ ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అభినందించారు. ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి, రైతుల ప్రశంసలు నన్ను చాలా ఆకట్టుకున్నాయి.
- పసుపు బోర్డు ప్రకటన తర్వాత రాజకీయ నాయకుల మీద మళ్లీ భరోసా ఏర్పడిందని ఓ రైతు కామెంట్ చేశాడు.
- పసుపు బోర్డు కోసం ఓ కేంద్రమంత్రి వెంటబడి సతాయించాను. లెక్కలేనన్ని సార్లు ఆయన కార్యాలయానికి వెళ్లి ఆయనతో పాటు సిబ్బందిని ఇబ్బంది పెట్టాను. చివరకు ఫలితం రావడం ఆనందంగా ఉంది.

ప్రధాని సభకు భారీ బందోబస్తు

- ఎస్పీజీ, ఎన్ఎస్‌జీ ఆధీనంలోకి సభాస్థలి
- నో ఫ్లయింగ్‌జోన్‌గా జీజీకాలేజీ ప్రాంతం
- నిఘా నీడలో ఇందూరు జనగర్జనసభ

ఖలీల్‌వాడి: ప్రధానమంత్రి నరేంద్రమోదీ జిల్లా కేంద్రానికి మంగళవారం రానున్న నేపథ్యంలో పోలీసులు అడుగడుగునా బందోబస్తు ఏర్పాటు చేశారు. గిరిరాజ్ కాలేజీ మైదానాన్ని ఎస్పీజీ, నేషనల్ సెక్యూరిటీ గార్డ్స్ తమ ఆధీనంలోకి తీసుకున్నాయి. ఎస్పీజీ, ఎన్‌హెచ్‌జీ ఐజీ, డీఐజీ, ఎస్పీ స్థాయి అధికారులు బందోబస్తును పర్యవేక్షిస్తున్నారు. నూతన కలెక్టరేట్ సమీకృత భవనం నుంచి వాయుసేనకు చెందిన రెండు హెలికాప్టర్లు ఏరియల్ సర్వే నిర్వహించాయి. కలెక్టరేట్ నుంచి మూడు కిలోమీటర్ల పరిసరాలను తనిఖీ చేశారు. 30 డాగ్‌స్క్వాడ్లు తనిఖీల్లో భాగమయ్యాయి.



గిరిరాజ్ కళాశాల మైదానంలో ప్రధాని పాల్గొనే సభా వేదిక



బాంబ్, డాగ్ స్క్వాడ్ తనిఖీలు

2,500 మంది పోలీసులు

బందోబస్తు విధుల కోసం 12 జిల్లాల నుంచి పోలీసులు జిల్లా కేంద్రానికి చేరుకున్నారు. ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి సీపీ సత్యనారాయణతో మాట్లాడి బందోబస్తు వివరాలను తెలుసుకున్నారు. జీజీ కళాశాల గ్రౌండ్ బయటి ప్రాంతం జిల్లా పోలీసుల ఆధీనంలో ఉంది. నూతన సమీకృత కలెక్టరేట్ నుంచి సభాప్రాంగణం వరకు ఉన్న 3 కిలోమీటర్ల పరిధిలో 2 వేల 500 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. ఐదుగురు ఎస్పీలు, ఇద్దరు బెటాలియన్ కమాండెంట్లు, పదమూడు మంది అదనపు ఎస్పీలు, 13 మంది ఏసీపీలతోపాటు 107మంది సీఐలు, 200 మంది ఎస్సైలు, 1900 మంది సిబ్బంది బందోబస్తులో పాల్గొంటున్నారు. ఎక్కడికక్కడ సీసీ కెమెరాలను ఏర్పాటు చేసిన పోలీసులు వీఐపీ, వీవీఐపీలనూ క్షుణ్ణంగా తనిఖీ చేసిన తరువాతే లోనికి అనుమతించనున్నారు. 20 రకాల ఐడీ కార్డులను అధికారిక, అనధికారిక సిబ్బందికి అందజేశారు.

ట్రాఫిక్ ఆంక్షలు

- ఆర్మూర్, నిర్మల్, ఆదిలాబాద్, మెట్‌పల్లి, జగిత్యాల, కరీంనగర్, కామారెడ్డి, మెదక్‌వైపు నుంచి వచ్చే వాహనాలు కంఠేశ్వర్ బైపాస్‌లో ప్రజలను దింపాలి. ఉమెన్స్ కాలేజీ, పాలిటెక్నిక్‌గ్రౌండ్(ఎగ్జిబిషన్ గ్రౌండ్), సీఎస్ఐ కళాశాలలో వాహనాలను పార్కింగ్ చేయాలి.
- బాన్సువాడ, ఎల్లారెడ్డి, నాగిరెడ్డిపేట్, జుక్కల్, బోధన్, భైంసా, ముథోల్ వైపునుంచి సభకు వచ్చే వాహనాలను అర్సపల్లి, రైల్వే గేట్, ఖానాపూర్ చౌరస్తాలో ప్రజలను దింపిన తరువాత, శ్రద్ధానంద్ గంజ్(కిసాన్‌గంజ్)లో వాహనాలను పార్కింగ్ చేయాలి.
- వీఐపీలు గిరిరాజ్‌కళాశాల సమీపంలోని హనుమాన్ మందిరం వెనుక ప్రాంతంలో, వీవీఐపీలు ముందు ప్రాంతంలో వాహనాలను పార్కింగ్ చేయాలి.

డ్రోన్‌లకు అనుమతి లేదు..

ప్రధాన మంత్రి పర్యటన పూర్తయ్యేంత వరకు డ్రోన్‌లకు అనుమతిలేదు. ఎవరైనా డ్రోన్‌లను వినియోగిస్తే కూల్చివేయడంతోపాటు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీపీ సత్యనారాయణ హెచ్చరించారు. కలెక్టరేట్ నుంచి సభాస్థలి వరకు ఎలాంటి వాహనాలను అనుతించేది లేదన్నారు.

క్లుప్తంగా

బాల్కొండలో యోగా పోటీలు



బాల్కొండ: మండల కేంద్రంలో జిల్లా యోగా అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి నిజామాబాద్ జిల్లా యోగా పోటీలను సోమవారం నిర్వహించారు. పోటీల్లో 232 మంది బాల, బాలికలు పాల్గొన్నారు. నిర్వాహకులు అండర్-8 నుంచి అండర్-16 విభాగాల వరకు పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా యోగా అసోసియేషన్ అధ్యక్షుడు ఐశ్వరయ్య, ప్రధాన కార్యదర్శి గంగాదర్, ఉపాధ్యక్షుడు ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని మోదీ బహిరంగ సభ ఏర్పాట్ల పరిశీలన



సుభాష్‌నగర్: నగరంలోని గిరిరాజ్ కళాశాల మైదానంలో మంగళవారం నిర్వహించే ప్రధాని మోదీ ఇందూరు జనగర్జన బహిరంగ సభ ఏర్పాట్లను ఎంపీ ధర్మపురి అర్వింద్, బీజేపీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి ప్రేమేందర్‌రెడ్డి సోమవారం పరిశీలించారు. రెండ్రోజులుగా ఇక్కడే మకాం వేసి మోదీ సభ ఏర్పాట్లను ఎంపీ అర్వింద్, ప్రధానకార్యదర్శి ప్రేమేందర్‌రెడ్డి పర్యవేక్షిస్తున్నారు. వారి వెంట రాష్ట్ర కార్యదర్శి పల్లె గంగారెడ్డి, నాయకులు సంగప్ప, ధన్‌పాల్ సూర్యనారాయణ, దినేశ్ కులాచారి, జిల్లా, రాష్ట్ర, వివిధ మోర్చాల నాయకులు ఉన్నారు.

'మోదీపై అభిమానం'



నగరంలోని పెద్దబజార్ చౌరస్తాలో పువ్వుల షాపు నడిపే సత్యం తన హెయిర్ స్టైల్ ద్వారా ప్రధాన మంత్రి నరేంద్రమోదీ పేరు వచ్చేలా అభిమానం చాటుకున్నాడు. ఒక వైపు కమలం పువ్వు, మరోవైపు మోదీ పేరు వచ్చేలా కటింగ్ చేయించుకున్నాడు.
- సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

మోదీజీ.. మొర ఆలకించండి

- జిల్లాలో ఆయుర్వేదానికి పెరుగుతున్న ఆదరణ
- ఆసుపత్రి ఏర్పాటు చేయాలని వినతులు



నిజామాబాద్‌నాగారం: దీర్ఘకాలిక రోగాలు ఆయుర్వేదంతో నయమవుతుండడం, ప్రజల్లో డిమాండ్ పెరగడం జిల్లాలో ఆయుర్వేద ఆస్పత్రి ఏర్పాటు ప్రాధాన్యతను తెలుపుతున్నది. పక్షవాతం, కీళ్లసంబంధిత వ్యాధులు, డిస్క్ డిజార్డర్స్, సర్వైకల్, స్త్రీ సంబంధిత వ్యాధులు, ఇన్‌ఫర్టిలిటీ, పిల్లల్లో వచ్చే డెవలప్‌మెంట్ డిజార్డర్స్, పైల్స్, ఫిస్టులా, చర్మసంబంధిత వ్యాధులు తదితర వాటికి ఆయుర్వేదంతో చక్కని ఫలితాలున్నాయి. దీంతో జిల్లాలో ఆయుర్వేదానికి డిమాండ్ పెరుగుతున్నది. అయితే రోగులకు కేవలం అవుట్‌పేషెంట్ సేవలు మాత్రమే అందుతున్నాయి. ఇన్‌పేషెంట్ సేవలు లేకపోవడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలోని 17 ఆయుర్వేద ఆస్పత్రుల్లో అవుట్‌పేషెంట్ సేవలు అందుతుండగా, ఒక్కో ఆస్పత్రిలో ప్రతిరోజూ 30మంది వరకు రోగులు వైద్య సేవలు పొందుతున్నారు. దీర్ఘకాలిక రోగాలతో బాధపడుతున్న వారు సైతం మందులు తీసుకొని వెళ్లిపోవాల్సిన పరిస్థితి ఉంది. దీంతో ఇన్‌పేషెంట్ సేవల కోసం వరంగల్, హైదరాబాద్‌లోని ఆయుర్వేద ఆస్పత్రులకు వెళ్తున్నారు. అక్కడే ఉండి వైద్యం చేయించుకుంటున్నారు. నిర్మల్, నిజామాబాద్‌జిల్లాలో ఏర్పాటు చేయాల్సిన ఆయుర్వేద ఆస్పత్రిని గతంలో రాష్ట్ర ప్రభుత్వంలోని పెద్దలు, ప్రజాప్రతినిధులు సిద్దిపేటలో ఏర్పాటు చేయించారు.

జిల్లాలో అత్యవసరం

నిజామాబాద్‌జిల్లాలో ఆయుర్వేద ఆస్పత్రి ఏర్పాటు అత్యవసరం. రైలు సౌకర్యం ఉండడంతో జిల్లాకు సరిహద్దులో ఉండే మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల ప్రజలు సైతం ఆయుర్వేద వైద్యం కోసం జిల్లాకు వస్తున్నారు. ఆయుర్వేద వైద్యం కోసం 50 పడకల ఆస్పత్రిని కచ్చితంగా ఏర్పాటు చేయాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

బంగారు తల్లి పథకాన్ని ప్రవేశపెడతాం

- టీపీసీసీ మ్యానిఫెస్టో కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు



మాట్లాడుతున్న దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

ఖలీల్‌వాడి: తెలంగాణలో బంగారు తల్లి పథకం తీసుకొచ్చేందుకు మ్యానిఫెస్టో కమిటీ చర్చలు జరుపుతుందని టీపీసీసీ మ్యానిఫెస్టో కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే దుద్దిల్ల శ్రీధర్‌బాబు అన్నారు. నగరంలోని కాంగ్రెస్ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా కాంగ్రెస్ నేతల నుంచి మ్యానిఫెస్టో కమిటీ ఇచ్చిన వినతులను స్వీకరించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా బంగారుతల్లి పథకానికి రూపకల్పన చేస్తున్నట్లు తెలిపారు. దీనికి సంబంధించిన అన్ని విషయాలను త్వరలో వెల్లడిస్తామని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ తీసుకొచ్చిన ఆరు గ్యారంటీ పథకాలపై నేతలు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఈ పథకాలను ప్రకటించిన తర్వాత బీఆర్ఎస్, బీజేపీల్లో గుబులు పుట్టుకున్నట్లు చెప్పారు. అందుకే కర్ణాటకలో ఈ పథకాలు అమలు చేయలేదని లేని ఆరోపణలు చేస్తున్నారని చెప్పారు. రూ.5 లక్షల కోట్లు తెలంగాణ ప్రభుత్వం అప్పులు చేసిందని, వీటిని కాంట్రాక్టర్ల పేరిట దోపిడీ చేశారని ఆరోపించారు. ఉద్యోగులకు నెలసారి వేతనాలు చెల్లించడంలో రాష్ట్ర ప్రభుత్వం తాత్సారం చేస్తుందని విమర్శించారు. దీంతో ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే 2 లక్షల ఉద్యోగాలు అందిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మాజీ మంత్రి సుదర్శన్ రెడ్డి, మాజీ ప్రభుత్వ విప్ అనిల్, టీపీసీసీ ఉపాధ్యక్షుడు తాహెర్ బిన్‌హందాన్, రూరల్ ఇన్‌చార్జి భూపతిరెడ్డి, పీసీసీ ప్రధాన కార్యదర్శి గడుగు గంగాధర్, పీసీసీ ప్రధాన కార్యదర్శి నగేశ్‌రెడ్డి, రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు అన్వేశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ అరికెల నర్సారెడ్డి, వివిధ విభాగాల జిల్లా, నగర అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

లక్కంపల్లి సెజ్‌లో యూనిట్ల నిర్మాణం పూర్తి చేయాలి

- ప్రధానికి మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి విజ్ఞప్తి



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: జిల్లాలోని నందిపేట మండలం లక్కంపల్లి సెజ్ (ప్రత్యేక ఆర్థిక మండలి)లో అగ్రికల్చర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పరిశ్రమలు, ఆహార శుద్ధి పరిశ్రమల యూనిట్ల నిర్మాణం పూర్తి చేయాలని రాష్ట్ర మాజీ మంత్రి పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డి ప్రధాని మోదీకి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో సోమవారం మాట్లాడారు. మాజీ సీఎం రాజశేఖర్‌రెడ్డి హయాంలో లక్కంపల్లి సెజ్‌కు 390 ఎకరాల భూమి కేటాయించినట్లు తెలిపారు. అదేవిధంగా అప్పటి కేంద్ర వ్యవసాయ మంత్రి శరద్‌పవార్‌తో తాను మాట్లాడి ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ కోసం రూ.50 కోట్లు మంజూరు చేయించినట్లు పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రావడంతో సదరు యూనిట్ నిర్మాణం అసంపూర్తిగా ఆగిపోయిందన్నారు. ప్రధానమంత్రి ప్రత్యేక దృష్టి సారించి నిర్మాణం పూర్తి చేయించాలని కోరారు.

పసుపు బోర్డు కేవలం ఎన్నికల జిమ్మిక్కు

- చట్ట సవరణ చేయకుండానే పసుపు బోర్డా..
- మంత్రి ప్రశాంత్‌రెడ్డి



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి

మోర్తాడ్(బాల్కొండ): పసుపు బోర్డు కేవలం ఎన్నికల జిమ్మిక్కు అని, స్పైసిస్ బోర్డులో భాగంగా ఉన్న పసుపునకు ప్రత్యేక బోర్డు ఏర్పాటు చేయాలంటే చట్ట సవరణ చేయాల్సి ఉందని ఈ విషయం ప్రధాని నరేంద్ర మోదీకి తెలియదా అని రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి ప్రశాంత్‌రెడ్డి ప్రశ్నించారు. 1986లో పార్లమెంట్ ద్వారా చట్టమైన స్పైసిస్ బోర్డులో పసుపు ఒక భాగం అని గుర్తు చేశారు. ప్రత్యేక చట్టం ద్వారానే పసుపు బోర్డు సాధ్యమవుతుందని వెల్లడించారు. ఏర్గట్ల మండలంలోని తొర్తి, తాళ్లరాంపూర్, గుమ్మిర్యాల్, బట్టాపూర్‌లో రూ.21 కోట్ల విలువ చేసే అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలను నిర్వహించిన ఆయన ఈ సందర్భంగా మాట్లాడారు. రైతులపై చిత్త శుద్ధి ఉంటే పార్లమెంట్‌లో ఎందుకు బిల్లు ప్రవేశ పెట్టలేదని ప్రశ్నించారు. రాబోయే అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో లబ్ధి పొందడానికి ప్రధాని కొత్త ఎత్తుగడ వేశారని ఆరోపించారు. వ్యవసాయానికి 24 గంటల పాటు నిరంతర విద్యుత్ అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని గుర్తు చేశారు. కార్యక్రమంలో డీసీసీబీ వైస్ చైర్మన్ రమేశ్‌రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కొటపాటి నర్సింహ నాయుడు, రాజారాం యాదవ్, ఎంపీపీ కొలిప్యాక ఉపేంద్ర, జడ్పీటీసీ సభ్యుడు గుల్లె రాజేశ్వర్, సర్పంచులు కుండ నవీన్, భానుప్రసాద్, పద్మ, పార్టీ మండల అధ్యక్షుడు రాజాపూర్ణనందం తదితరులు పాల్గొన్నారు.



నగరంలో మోదీ ఇందూరు జనగర్జన సభకు ఏర్పాటు చేసిన భారీ ఫ్లెక్సీలు



సభలో మోదీ తిరిగే వాహనం ట్రయల్ రన్



సభ వేదిక వద్ద మహిళలతో మాట్లాడుతున్న ఎంపీ అర్వింద్

మోదీ సభకు ఇందూరు సిద్ధం

ప్రధాని నరేంద్ర మోదీ ఇందూరు జనగర్జన బహిరంగ సభకు ఇందూరు సిద్ధమైంది. అధికార యంత్రాంగం అన్ని చర్యలు చేపట్టింది. సభా ప్రాంగణం కేంద్ర పోలీస్ ఆధీనంలోకి వెళ్లడంతో పటిష్ఠ బందోబస్తు నిర్వహించారు. ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాలోని ప్రధాన కూడళ్ల వద్ద పార్టీ నాయకులు జనగర్జన పోస్టర్లను ప్రదర్శించారు.



సభా వేదిక వద్ద పోలీసులు



డాగ్, బాంబ్‌స్క్వాడ్ బృందాల వివరాలు తెలుసుకుంటున్న పోలీసులు

మత్స్య శాఖ ఏడీపై ఫిర్యాదు

డొంకేశ్వర్(ఆర్మూర్): గంగపుత్రులను కాదని ఇతర కులాల వారికి సొసైటీలో సభ్యత్వం ఇచ్చే ప్రయత్నం చేస్తున్న జిల్లా మత్స్య శాఖ అధికారి రాజనర్సయ్యపై చర్యలు తీసుకోవాలని గంగపుత్ర సంఘాల నాయకులు మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌కు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు చేసిన వారిలో వినోద్ కుమార్, అన్నయ్య, రవి, ఆనంద్ తదితరులు ఉన్నారు.

రూరల్ కానిస్టేబుల్ సస్పెన్షన్

ఖలీల్‌వాడి/ నిజామాబాద్ రూరల్: విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన రూరల్ పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్ ఎ.వరప్రసాద్‌పై చర్యలు తీసుకున్నట్లు సీపీ సత్యనారాయణ తెలిపారు. ప్రధా ని మోదీ పర్యటనకు జిల్లా కేంద్రంలోని శ్రీ రామ గార్డెన్స్‌కు ఇతర జిల్లాల నుంచి వచ్చి న పోలీసు సిబ్బందికి లైజనింగ్ ఆఫీసర్‌గా విధులు నిర్వహించాలని ఆదేశాలు ఇచ్చినట్లు వెల్లడించారు. సదరు కానిస్టేబుల్ విధులకు గైర్హాజరై దగ్గరలోని వైన్స్ షాప్‌లో మద్యం సేవించి కొంత మందితో గొడవకు దిగినట్లు చెప్పారు. క్రమశిక్షణ చర్యల్లో భా గంగా సోమవారం కానిస్టేబుల్‌ను సస్పెన్షన్ చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు. పూర్తిస్థా యి విచారణ కోసం టాస్క్ ఫోర్స్ ఏసీపీ రాజశేఖర రాజును ఏర్పాటు చేసినట్లు చెప్పా రు. కాగా విధి నిర్వహణలో ఉన్న కానిస్టేబుల్ వరప్రసాద్‌పై దాడి చేసి తీవ్రంగా గాయపర్చిన ఐదుగురిని పట్టుకొని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌హెచ్‌వో మహేశ్ కుమార్ తెలిపారు. నిందితుల నుంచి బైక్‌లు, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

రాజకీయ లబ్ధికోసమే బోర్డు ప్రకటన



ఆర్మూర్: ఎన్నికల వేళ రాజకీయ లబ్ధి కోసమే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పసుపు బోర్డు ఏర్పాటుకు అనుకూలంగా ప్రకటన చేశారని పసుపు రైతుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కోటపాటి నర్సింహ నాయుడు సోమవారం ఆరోపించారు. పసుపు బోర్డు ఏర్పాటు చేయాలంటే పార్లమెంట్‌లో చట్ట సవరణ చేయాలన్నారు. స్పైస్ బోర్డు నుంచి పసుపును వేరు చేయడానికి పార్లమెంట్‌లో చట్టం చేయాల్సి ఉంటుందనే విషయం ప్రధానికి తెలియదా అని ప్రశ్నించారు. ఎన్నికల సమయంలోనే పసుపు రైతులు గుర్తుకు రావడం వెనుక ఆంతర్యం ఏమిటో బీజేపీ నాయకులే తెలుపాలని అన్నారు.

వేర్వేరు ఘటనల్లో పలువురి మృతి

బాన్సువాడ రూరల్: ఆర్‌ఎంపీ చేసిన వైద్యం వికటించి ఒకరు చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన మండలంలోని ఇబ్రహీంపేట్‌లో చోటు చేసుకుంది. సీఐ మహేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. బోధన్ పట్టణం రాకాసిపేటకు చెందిన షేఖ్ రహూఫ్(31) ఇబ్రహీంపేట్‌లో ప్రసవించిన తన భార్య, బిడ్డను చూసేందుకు సెప్టెంబర్ 27న వచ్చాడు. అదేరోజు తీవ్రజ్వరానికి గురైన రహూఫ్‌ను తన మామ స్థానిక ఆర్‌ఎంపీ యాదగిరిగౌడ్‌కు చూయించారు. పరీక్షించిన ఆర్‌ఎంపీ నడుము భాగంలో జ్వరం తగ్గకపోవడంతో విడతల వారీగా మూడు సార్లు ఒకే చోట సూది ఇచ్చాడు. దీంతో చర్మం కమిలిపోయింది. దీంతో ఉస్మాన్‌ను అతని తండ్రి ఇబ్రహీం మొదటగా బోధన్ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా మెరుగైన చికిత్స నిమిత్తం నిజామాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో ఆపరేషన్ చేయించారు. అక్కడి నుంచి మరో ఆసుపత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. తన కుమారుని మృతుకి ఆర్‌ఎంపీ కారణమని మృతుడి తండ్రి ఇబ్రహీం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

ప్రమాదవశాత్తు ఒకరు..



నందిపేట్(ఆర్మూర్): మండల కేంద్రానికి చెందిన షేక్ హుస్సేన్ (57) చెరువు మునిగి మృతి చెందాడు. ఆదివారం ఇంటి నుంచి బయలు దేరిన షేక్ హుస్సేన్ ఇటీవల చెరువులో నిమజ్జనం చేసిన గణపతుల విగ్రహాల కింద ఉండే ఇనుపచువ్వలను తీసుకునేందుకు మండల కేంద్రంలోని ఊర చెరువులోకి దిగాడు. రాడ్లు తీసే క్రమంలో విగ్రహంలోని ఇనుపచువ్వల్లో కాలు ఇరుక్కుపోవడంతో ఊపిరాడక మృతి చెందాడు. సోమవారం చెరువులో మృతదేహం లభ్యం కావడంతో మృతుడి భార్య ఖాదర్ బీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి చేసినట్లు ఎస్సై రాహుల్ తెలిపారు.

రెండు బైక్‌లు ఢీ.. ఇద్దరికి గాయాలు




గాంధారి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని సోమారం రోడ్డుపై రెండు బైక్‌లు ఢీకొన్న ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. మండలంలోని తిమ్మాపూర్‌కు చెందిన పుట్టల సాయిలు, ఇందల్వాయి మండలం గన్నారంకు చెందిన చంద్రు బైకులపై వేగంగా ఎదురెదురుగా ఢీకొన్నారు. ఈ ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి.

హైదరాబాద్‌లో సిరికొండ వాసి..



సిరికొండ: హైదరాబాద్‌లో సిరికొండకు చెందిన వెంగల సాగర్(30) ఆత్మహత్య చేసుకున్నట్లు గ్రామస్తులు సోమవారం తెలిపారు. సాగర్ హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. స్నేహితులతో గదిలో ఉండే సాగర్ శనివారం లాడ్జీలో గది అద్దెకు తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఆదివారం ఫ్యానుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు స్థానికుల ద్వారా తెలిసినట్లు వారు తెలిపారు. మృతుడి తల్లిదండ్రులు గతంలోనే చనిపోగా ఇద్దరు అక్కలు ఉన్నారు. సోమవారం సాయంత్రం సిరికొండలో మృతుడి అంత్యక్రియలు నిర్వహించారు.

పిల్లలు పుట్టడం లేదని..



బీబీపేట: పిల్లలు పుట్టడం లేదని ఒకరు తీవ్ర మనస్తాపానికి గురై చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన సోమవారం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్సై సాయిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన మద్దూరి పోచయ్య (50) వ్యవసాయ పనులు చేసుకుంటు జీవిస్తున్నాడు. కొద్ది రోజులుగా తనకు పిల్లలు కలగడం లేదని, చేసిన అప్పులు ఎక్కువ కావడంతో తీవ్ర మనస్తాపానికి గురై గ్రామ పెద్దచెరువులో పడి ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య బాలలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

పాము కాటుతో వృద్ధుడు..



కామారెడ్డి క్రైం: పాము కాటుకు గురై ఓ వృద్ధుడు మృతి చెందిన ఘటన మున్సిపల్ పరిధిలోని టేక్రియాల్ వద్ద సోమవారం చోటు చేసుకుంది. జిల్లా కేంద్రంలోని ఇందిరానగర్ కాలనీకి చెందిన పరమేశ్వర్ (70) ఆరు నెలలుగా ఆలయ సేవ చేసుకుంటూ టేక్రియాల్ శివారులోని కృష్ణ మందిరంలో ఉంటున్నాడు. ఉదయం ఎనిమిది గంటల ప్రాంతంలో కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చి తనను పాము కాటు వేసిందని వైద్యులకు తెలుపగా పరీక్షించిన వైద్యులు చికిత్స చేస్తుండగా మృతి చెందాడు. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు దేవునిపల్లి ఎస్సై గుండెల రాజు తెలిపారు.

ఇద్దరు టీచర్ల సస్పెన్షన్ కలకలం

బోధన్: మండలంలోని పెంటాకుర్దు జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు టీచర్లు సాయిలు, శివయ్యపై ఈ నెల 29న డీఈవో దుర్గాప్రసాద్ సస్పెన్షన్ వేటు వేశారు. కలకలం రేపిన ఈ ఘటన ఉపాధ్యాయుల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. తరగతి గదిలో విద్యార్థినులపై సదరు ఉపాధ్యాయులు అనుచిత భాషతో అమర్యాదగా మాట్లాడడం, కులం పేరుతో పిలిచి అవహేళన చేస్తున్నారని కొందరు విద్యార్థినులు తల్లీదండ్రులకు చెప్పుకోవడంతో వారు పాఠశాలకు వచ్చి కొన్ని రోజుల క్రితం టీచర్లను నిలదీశారు. ఈ క్రమంలో బాలికల అభిప్రాయాలను వీడియో రికార్డు చేసి డీఈవోకు పంపించారు. తమ వల్ల తప్పిదం జరిగినట్టు టీచర్లు హెచ్‌ఎంకు వివరణ ఇవ్వగా వారు ఇచ్చిన సంజాయిషీని డీఈవోకు పంపించారు. డీఈవో ఆదేశాల మేరకు ఎంఈవో నాగ్‌నాథ్, మండల నోడల్ అధికారి నాగయ్య విచారణ చేపట్టగా నివేదిక ఆధారంగా టీచర్లను సస్పెన్షన్ చేస్తూ డీఈవో ఉత్తర్వులు జారీ చేశారు. ఎంఈవో నాగ్‌నాథ్‌ను ఫోన్‌లో సంప్రదించగా టీచర్లపై చర్యలు తీసుకున్నామని వెల్లడించారు.

అన్నారంలో చిరుత ఆనవాళ్లు



బాన్సువాడ: బీర్కూర్ మండలం అన్నారం శివారులో సోమవారం చిరుత ఆనవాళ్లు కనిపించినట్లు గ్రామస్తులు తెలిపారు. గుట్ట ప్రాంతంలో చిరుత కాలి గుర్తులు పరిశీలించిన గ్రామస్తులు అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. రాత్రి వేళల్లో శివారు ప్రాంతాలకు ఎవరూ వెళ్లవద్దని అటవీశాఖ అధికారులు గ్రామస్తులకు సూచించారు.

క్రైం కార్నర్

ఆటోను ఢీకొన్న కారు



జక్రాన్‌పల్లి: మండలంలోని బాలానగర్ జాతీయ రహదారిపై ఆగి ఉన్న ఆటోను కారు ఢీకొన్న ఘటనలో ఒకరికి తీవ్ర గాయాలు కాగా మరో ఇద్దరికి స్వల్పగాయాలయ్యాయి. పడకల్‌నుంచి నిజామాబాద్‌కు వెళ్తున్న ఆటోను వెనుక నుంచి వచ్చిన కారు ఢీకొన్నది. ఈ ఘటనలో ప్రయాణికురాలు పడకల్‌కు చెందిన జీల రజితకు తీవ్రగాయాలు కాగా ఆమె కూతురు, ఏడాది కుమారుడికి స్వల్ప గాయాలయ్యాయి. ఆటోలో డ్రైవర్‌తో పాటు మరో ముగ్గురు ఉన్నారు. ఈ విషయమై ఎస్సైని వివరణ కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పేర్కొన్నారు.

బీర్కూర్‌లో పిచ్చికుక్కల దాడి



బాన్సువాడ రూరల్: మండల కేంద్రంతో పాటు తిమ్మాపూర్, బైరాపూర్ గ్రామాల్లో పిచ్చికుక్కలు సోమవారం వీరంగం సృష్టించాయి. బైరాపూర్‌కు చెందిన కుమ్మరి నారాయణపై పిచ్చికుక్క దాడి చేయడంతో కంటివద్ద తీవ్ర గాయాలయ్యాయి. తిమ్మాపూర్‌లో ఇద్దరిపై, మండల కేంద్రంలోని రంగాజీనగర్ కాలనీలో సోని, వర్షిత్ అనే చిన్నారులపై, మజీద్ గల్లీలో విశ్వరావప్ప అనే వృద్ధుడిపై కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపర్చాయి. కొత్తాబాద్ నతీశ్ అనే వ్యక్తిని కూడా గాయపర్చినట్లు గ్రామస్తులు తెలిపారు. ఒకేసారి కుక్కలు స్వైరవిహారం చేసి పలువురిని గాయపర్చడంతో ప్రజలు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

వాహనాల తనిఖీ



ఎల్లారెడ్డి: మండల కేంద్రంలో వాహనాల తనిఖీ చేపట్టినట్లు ఎస్సై గణేశ్ సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా సరైన ధ్రువపత్రాలు, ఇన్సూరెన్సు, నంబర్ ప్లేట్ లేని ట్రాక్టర్లు, ఆటోలు, బైకులను సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. వాహనదారులు తప్పకుండా తమవద్ద ధ్రువీపత్రాలను ఉంచుకోవాలని సూచించారు. పలువురి వాహనదారులకు జరిమానా విధించారు.

ఆర్టీసీ ఉద్యోగి నిజాయితీ



మోర్తాడ్: బస్టాండ్‌లో ఓ ప్రయాణికురాలు మరిచిపోయిన బ్యాగును తాత్కాలిక ఉద్యోగి ప్రసాద్ బాధితురాలికి అప్పగించి తన నిజాయితీ చాటుకున్నాడు. సోమవారం జగిత్యాల్ జిల్లా బండాలింగాపూర్‌కు చెందిన రాధా మోర్తాడ్ బస్టాండ్‌లో తన బ్యాగును మరిచిపోయింది. గమనించిన ప్రసాద్ బ్యాగును దాచి ఆమె రాగానే నలుగురి సమక్షంలో విచారించి అందులో ఉన్న నగదు రూ.9,700, రూ.12వేలు విలువ చేసే కమ్మలు, సెల్‌ఫోన్, ఇతర సామాగ్రిని అందజేశారు. దీంతో ఆర్టీసీ ఉద్యోగి నిజాయితీకి స్థానికులు అభినందనలు తెలిపారు.